# పొడుగు గీత

— దొడ్డింగి వెంకట్రావ్



తన ఇంటి గడపలో వాలుకుర్చీ వేసుకుని చేరబడి ఆ నక్షత్రాన్ని, కొబ్బరి చెట్టుని తదేకంగా చూస్తూ ఆలోచిస్తున్నాడు ప్రశాంత్. తనలో చెలరేగుతున్న ఉద్రిక్త భావాలకు ప్రతి రూపంగా కనిపిస్తున్నాయవి.

కొన్ని సంవత్సరాల క్రితం చిన్న నిప్పు రవ్వలా, గుండెలో రగులుకున్న అగ్ని ఇప్పుడు దావానలంలా వ్యాపించి నిలువెల్లా దహించేస్తుంది. మనసంతా కల్లోలమై పోయింది- హృదయం నిండా అశాంతి నిండి పోయింది. దాని క్కారణం- తన అన్నయ్య శశికాంత్!

ప్లీడరు గుమాస్తా రామారావుగారికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు శశికాంత్, చిన్న వాడు ప్రశాంత్. ఇద్దరూ ఒక తండ్రి బిడ్డలే అయినా, ఇద్దరి జీవితాలూ ఒక్కలా లేవు. ఇద్దరి మధ్య తేడా హస్తిమశకాంతరం. శశికాంత్ ఇంజనీరు, ప్రశాంత్ టైలరు. తండ్రి చదివించలేనంటున్నా పట్టువదలకుండా కష్టపడి చదివి పది మంది సహాయ సహకారాలతో పైకి వచ్చాడు శశికాంత్. 'నేను చదివించలేను మొర్రో' అని రామారావుగారంటుంటే విసిగి ఇంటర్మీడియెట్ డిస్కంటిన్యూ చేసేశాడు ప్రశాంత్. అప్పట్నుంచి ఏం చేయాలో తోచక ఓ టైలరు వద్ద చేరి కాజాలు- గుండీలు కుట్టుకుంటూ క్రమంగా టైలరింగు నేర్చుకున్నాడు.

ఈ వ్యత్యాసమే ప్రశాంత్ హృదయాన్ని మరిగించేస్తుంది. 'శశికాంత్ కుటుంబం కదుపులోని చల్ల కదలకుండ హాయిగా అన్ని సుఖాలూ అనుభవిస్తుంటే, తన కుటుంబం తనతో బాటు కష్టబడినా రోజు గడవటం కష్టమౌతుంది. ఒకే చెట్టుకి కాసిన రెండు కాయల్లో ఇంతటి వ్యత్యాసమా?' గుండె మండిపోతుంది. ప్రశాంత్ ఆలోచిస్తున్నాడు. ఆలోచనలు ఒక కొలిక్కి రావడం లేదు. చెల్లా చెదురుగా విపరీతమైన వేగంతో భ్రమిస్తున్నాయి.

అంతలో వీధి చివర గుడిసెలోంచి మధురమైన ఓ స్వరం వినిపించింది. రిక్షా రంగడి కంఠమది. తత్వగీతం పాడుతున్నాడు హాయిగా. ఆనందంగా. పగలంతా తానుచేసిన కష్టానికి అతీతంగా. ఆ స్వరంలో మాధుర్యం వాడి గొంతులో లేదు. ఆ గీతంలో వుంది... ప్రపంచాన్ని మరచిపోయే వాడి హృదయంలో వుంది.

ప్రశాంత్ ఆ గీతాన్ని వింటూ క్రమంగా చల్లబడ్డాయి. గాలి జోరు తగ్గి కొబ్బరిచెట్టు నిదానంగా వూగుతుంది. మబ్బుతొలగి నక్షత్రం స్పష్టంగా మెరుస్తుంది.

తన సంపాదన తక్కువైనా ఖర్చు కూడా ఏమంత ఎక్కువ కాదు. తనకు ఒక కొడుకు- ఒక కూతురు... సంపాదించినదానిలో మిగులంటూ అంతగా లేక పోయినా ఇబ్బందులు అట్టే లేవు... మరి శశికాంత్ పరిస్థితో? అయిదుగురాడపిల్లలు- వాళ్ళ చదువులు- వారికి సరిపడే సంబంధాలు- కట్నాలు, కానుకలు... రాత్రిళ్ళు సరిగా నిద్రపోతున్నాడో, లేదో... ప్చ...!

ఆలోచనల్లో తీవ్రత పూర్తిగా హరించుకు పోయింది. అలాగే ఆ చల్లని గాలిలో ప్రశాంత్ ప్రశాంతంగా నిద్రపోయాడు.

**     **     **

ఉదయాన్నే బడికి వెళ్ళబోతూ కొడుకు ఒక చిక్కు సమస్యను ప్రశాంత్ దగ్గరకు తీసుకొచ్చాడు. పలక మీద ఒక గీత గీసి, "'నాన్నా! చెరపకుండా దీన్ని చిన్నదిగా చేయుటమెలా?" అని అడిగాడు. బళ్ళో అతన్ని ఎవరడిగారో ఏమో గాని పాపం, తన మేధకు తట్టక తికమక పడుతున్నాడు.

ప్రశాంత్ చిన్నగా నవ్వి, "దీనికింత కంగారెందుకురా! దాని ప్రక్కనే పొడుగ్గా మరో గీత గియ్యి! ఆ మొదటి గీత రెండో దాని కంటే చెరపకుండానే చిన్నదైపోతుంది!" అన్నాడు— ఆ సమాధానంలో గత రాత్రి అనుభవం గుర్తొచ్చి. ●

## డిక్షనరీ

డాక్టర్ శామ్యూల్ జాన్సన్స్ డిక్షనరీ విడుదలైన కొత్త రోజులవి. ఇద్దరు అందగత్తెలు జాన్సన్‌గారి ఇంటికి వెళ్ళారు. వారికి మర్యాద చేసి కూర్చో పెట్టాడు జాన్సన్.

"ఇంచుమించుగా ఉపయోగకరమైన అన్ని పదాలను మీరు డిక్షనరీలో పొందుపరిచారు. అయితే, కొన్ని చిలిపి పదాలకు, తిట్లువంటి వాటికి మీ డిక్షనరీలో చోటివ్వలేదు!" అన్నారు ఆ స్త్రీలు.

అందుకు జాన్సన్‌గారు చిరునవ్వు నవ్వి అన్నారు —

"మీరు ఆ చిలిపి పదాల కోసం, తిట్ల కోసం చూస్తున్నారన్నమాట? అవి మీకు నిజంగా కావాలా?"

ఆ అందగత్తెలు సిగ్గుపడిపోయి మళ్ళీ నోళ్ళు ఎత్తలేదు!

— కొడిమెల శ్రీరామమూర్తి